క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నందిగాం: కొత్తగ్రహారం, దేవుపురం ఫీడర్ల పరిధిలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ జి.శంకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగ్రహారం, దేవుపురం పరిధిలో జంగిల్ క్లియరెన్స్ చేస్తున్న దృష్ట్యా సరఫరా నిలిపి వేస్తున్నామని తెలిపారు. దీని వలన కొత్తగ్రహారం, పెద్దలవునిపల్లి, చిన్న లవునిపల్లి, కంచివూరు, కాపుతెంబూరు, మజ్జిగోపాలపురం, సింగుపురం, లట్టిగాం తదితర గ్రామాలకు అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

రక్తదాతలే ప్రాణదాతలు

ఇచ్ఛాపురం రూరల్: ఆపద కాలంలో రోగికి రక్తాన్ని అందించి వారి పాలిట ప్రాణదాతగా నిలిచిన వారు నిజమైన దేవుళ్లని విశ్రాంతి డీఎస్పీ శమ్మల వరప్రసాద్ అన్నారు. స్పెషల్ గాయ్స్ ఫౌండేషన్, హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో తలసేమియా పిల్లల కోసం గురువారం తిప్పనపుట్టుగలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతీ గ్రామంలో ఓ స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేసి యువకులు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. గ్రామ పెద్ద తిప్పన దాలయ్య రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని గుర్రం మృతి

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఒకటో వార్డు మొగిలిపాడు గ్రామం సమీపంలో జాతీయ రహదారిపై గురువారం ప్రమాదం చోటు చేసుకుంది. రోడ్డు దాటుతున్న గుర్రాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మరణించింది. చనిపోయిన గుర్రం 19వ వార్డు సూదికొండ ముస్లిం కుటుంబాలకు చెందినదిగా తెలిసింది.

టెక్కలి డీఎస్పీగా మూర్తి

టెక్కలి: టెక్కలి సబ్ డివిజన్ పోలీస్ అధికారి (డీఎస్పీ)గా డీఎస్ఆర్ వీఎస్ఎన్ మూర్తిని నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా పలుమార్లు డీఎస్పీలకు స్థాన చలనం కల్పిస్తూ బదిలీలు చేసినప్పటికీ టెక్కలి డీఎస్పీ పోస్టింగ్ విషయంలో మాత్రం జాప్యం నెలకుంది. ఎట్టకేలకు గతంలో టెక్కలిలో సీఐగా పనిచేసిన డీఎస్ఆర్ వీఎస్ఎన్ మూర్తిని డీఎస్పీగా నియమించారు. విజయవాడలో ఏసీబీ విభాగంలో డీఎస్పీగా పనిచేస్తున్న మూర్తిని టెక్కలి డీఎస్పీగా బదిలీ చేశారు.

108 ఉద్యోగులు సమ్మె నోటీసు

సంతబొమ్మాళి: తమ సమస్యలు, డిమాండ్లు నెరవేర్చకపోతే ఈనెల 25వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తామని 108 వాహన ఉద్యోగులు ప్రకటించారు. ఇందులో భాగంగా సమ్మె నోటీసులను ఎంపీడీవో జయంతి ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ నారాయణరావుకు గురువారం సిబ్బంది అందజేశారు. తమను వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగులుగా గుర్తించాలని, 108 సర్వీస్‌లను ప్రభుత్వమే నడపాలని, ప్రతినెల ఐదో తేదీలోగా జీతాలు చెల్లించాలని కోరారు. సిబ్బంది ఫాల్గుణరావు, అప్పలనాయుడు ఉన్నారు.
కోటబొమ్మాళి: స్థానిక సామాజిక ఆస్పత్రి వద్ద గల 108 వాహనం సిబ్బంది డిప్యూటీ తహసీల్దార్ ప్రసాదరావుకు సమ్మె నోటీస్ అందజేశారు.

భూ సమస్యలు పరిష్కరించుకోవాలి

కంచిలి: రీ సర్వేలో జరిగిన పొరపాట్లను సరిచేయడానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో ఏర్పడిన భూసమస్యల్ని పరిష్కరించుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి అన్నారు. ఇప్పటికే భూసర్వే పూర్తయిన జిల్లుండ రెవెన్యూ గ్రామంలో తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. రైతుల నుంచి వినతులను తహసీల్దార్ స్వీకరించారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పుస్తక ప్రదర్శన చేస్తున్న ప్రిన్సిపాల్ గోవిందమ్మ

టెక్కలి, వజ్రపుకొత్తూరు రూరల్, నందిగాం, సోంపేట, ఇచ్ఛాపురం, కాశీబుగ్గ: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భారత దేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటాలకు ఉన్నతాధికారులు, గ్రంథాలయ అధికారులు, పాఠకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు చోట్ల పుస్తక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. అలాగే పిల్లలకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంఈవోలు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు



ధర్మాన దుర్గ

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ లలితానగర్‌లో నివాసం ఉంటున్న వివాహిత ధర్మాన దుర్గ (35) కనిపించడం లేదని ఆమె సోదరుడు దూపాన సాయి ఫిర్యాదు చేసినట్టు కాశీబుగ్గ పోలీసులు గురువారం తెలిపారు. విశాఖలో డ్వాక్రా సమావేశం ఉందని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదని, ఆమె ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ వస్తుందని ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ఇదేం తీరు!



- ఉన్న పళంగా ఇళ్లను ఖాళీ చేయమంటున్న అధికారులు
- ఆందోళన చెందుతున్న హుద్‌హుద్ గృహ లబ్ధిదారులు

టెక్కలి:

అధికారులు వ్యవహరిస్తున్న తీరుతో రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రాతినిథ్యం వహిస్తున్న టెక్కలి మండలంలోని హుద్‌హుద్ గృహ లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. టెక్కలిలోని హుద్‌హుద్ లబ్ధిదారులంతా ఉన్న పళంగా ఇళ్లను ఖాళీ చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో వారంతా గుబులుగా ఉన్నారు. హుద్‌హుద్ ఇళ్ల వద్ద మౌలిక సదుపాయాలు కల్పిస్తామని.. తక్షణమే ఖాళీ చేయాలంటూ అధికారులు ఒత్తిడి తెస్తుండడంతో ఇప్పటికిప్పుడు తాము ఎక్కడకు వెళతామంటూ లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు సంభవించిన హుద్‌హుద్ తుఫాన్ అనంతరం నిరాశ్రయులైన నిరుపేదల కోసం ప్రభుత్వ ఆస్పత్రికి సమీపంలో సుమారు 192 ఇళ్లను నిర్మాణం చేశారు. అప్పటి ప్రభుత్వంలో అర్హులైన నిరుపేదల ఎంపిక విషయంలో ప్రమైన జాప్యం చేశారు. అంతే కాకుండా స్థానిక కార్యకర్తలు కొంత మంది ఇళ్లను వాటాలు వేసుకునే క్రమంలో ఎన్నికలు రావడంతో పాటు ప్రభుత్వం మారింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో సబ్ కలెక్టర్ స్థాయి అధికారులు క్షేత్ర స్థాయిలో అర్హులను ఎంపిక చేసి సుమారు 92 మంది నిరుపేదలకు ఇళ్లను కేటాయించారు. దీని కోసం ఒక్కో లబ్ధిదారుడు ప్రభుత్వానికి రూ.5 వేలు డిపాజిట్ చెల్లించారు. ఇదిలా ఉండగా గత టీడీపీ ప్రభుత్వం జాప్యం చేయడంతో హుద్‌హుద్ ఇళ్లతో పాటు పరిసరాల్లో మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. వైఎస్సార్సీపీ హయాంలో లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపు అనంతరం మౌలిక సదుపాయాలను కల్పించే క్రమంలో సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. ఇప్పుడు మరలా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అధికారులు చేస్తున్న హడావుడికి ప్రస్తుతం నివాసం ఉంటున్న వారంతా ఆందోళన చెందుతున్నారు. మౌలిక వసతుల కోసమే అయితే తాము ఇళ్లను ఎందుకు ఖాళీ చేయాలంటూ లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. తమను బలవంతంగా ఇళ్లను ఖాళీ చేయిస్తే నడిరోడ్డున పడతామంటున్నారు. దీనిపై అధికారులు ఆలోచన చేయాలని కోరుతున్నారు.

ఖాళీ చేయమంటే ఎక్కడకు వెళతాం...



తమను ఉన్న పళంగా ఇళ్లను ఖాళీ చేయమంటే నడిరోడ్డున పడడం తప్పా మరో దిక్కు లేదు. ఇక్కడ అన్నీ బాగు చేస్తాం అని చెబుతున్నారు. మా లాంటి నిరుపేదలకు ఈ ఇల్లే దిక్కు. మాపై దయ చూపి ఖాళీ చేయించకుండా సదుపాయాలు కల్పిస్తే మంచిది.

-కె.అప్పన్న, లబ్ధిదారుడు, టెక్కలి

మౌలిక వసుతులు కల్పించడానికే..



హుద్‌హుద్ ఇళ్లతో పాటు పరిసరాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికే ఇళ్లను ఖాళీ చేయాలని చెప్పాం. నిజమైన లబ్ధిదారులకు ఎటువంటి అన్యాయం జరగదు. ప్రస్తుతానికి 42 మంది నివాసం ఉంటున్నట్లు మా సర్వేలో తేలింది. ఇళ్ల ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కల్పనకు అంతా సహకరించాలి.

-ఎం.కృష్ణమూర్తి, ఆర్డీవో, టెక్కలి

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి

- సీతంపేట ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి
- భీంపురం గిరిజన ఆశ్రమ పాఠశాల సందర్శన

టెక్కలి: వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిలో అభ్యసనాభివృద్ధి మెరుగుపడే విధంగా ఉత్తమ బోధన చేయాలని సీతంపేట ఐటీడీఏ పీవో పి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. టెక్కలి మండలం భీంపురం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందజేస్తున్న మెనూ, పాఠశాల ఆవరణలో పాటిస్తున్న పరిశుభ్రత చర్యలు, మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. అనంతరం పీవో మాట్లాడుతూ.. విద్యార్థులంతా ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా బోధన చేయాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న మెనూ ప్రకారం భోజన వసతి కల్పించాలని, మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయాల విషయంలో పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం విద్యార్థులతో ముఖా ముఖీ నిర్వహించారు.



ఆశ్రమ పాఠశాలను పరిశీలిస్తున్న పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

అందరివాడు డాక్టర్ రమేష్

కాశీబుగ్గ: ఉద్దాన ప్రాంతంలో అందరితో సత్సంబంధాలు ఉన్న వ్యక్తి డాక్టర్ మడే రమేష్ అని వక్తలు అన్నారు. పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పని చేసే సమయంలో రెండేళ్ల క్రితం జరిగిన కారు ప్రమాదంలో రమేష్, ఆయన కుమారుడు సంకల్ప్ మరణించారు. రమేష్ ద్వితీయ వర్ధంతిని పలాస మండలం నీలావతి గ్రామం ఉద్దాన విద్యావేదనిక గ్రంథాలయం వద్ద గురువారం నిర్వహించారు. రమేష్ భార్య డాక్టర్ మడే లక్ష్మీప్రసన్న, కుమార్తె స్థైర్య సమక్షంలో డాక్టర్ చిత్రపటానికి స్థానికులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉద్దాన విద్యావేదిక గౌరవ సలహాదారునిగా పనిచేసిన రోజులను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో యూవీవీ అధ్యక్షులు బొమ్మాళి శివ, కార్యదర్శి గొరకల లోకేశ్వరరావు, ఉపాధ్యక్షులు పోతనపల్లి గీతమ్మ, కుత్తుం ప్రకాష్, జినగ సీతారాం, కుత్తుం వినోద్, తెప్పల అజయ్, వాసుదేవరావు, మహేష్, పానిల క్రిష్టారావు పాల్గొన్నారు.



డాక్టర్ రమేష్‌కు నివాళులర్పిస్తున్న భార్య ప్రసన్నలక్ష్మి, యూవీవీ సభ్యులు

స్మార్ట్ మీటర్లు ఆపాలి

సోంపేట: విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఆపాలి, ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రజా పోరు ధర్నాను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు సంగారు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. రైతులు, ప్రజల పాలిట ఉరితాళ్లుగా మారనున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగింపు ప్రక్రియ తక్షణమే నిలుపుదల చేయాలన్నారు. గత ప్రభుత్వ హయంలో స్మార్ట్ మీటర్లు పెట్టడాన్ని వ్యతిరేకించిన కూటమి నాయకులు ఇప్పుడు చేస్తున్నది నమ్మక ద్రోహం కాదా అని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్ల ప్రక్రియ విరమించకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. నాయకులు దున్న యామయ్య, డి.కృష్ణారావు, కె.సింహాచలం, టి.రామారావు ఉన్నారు.

ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలి

పలాస: విద్యుత్ ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పలాస తహసీల్దార్ కల్యాణ చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం పలాస మండల కమిటీ నాయకుడు ఎన్.గణపతి, ఎస్ఎఫ్ఐ నాయకులు టి.ఎం రాజు, ఎన్.ధర్మారావు, పి.మధు, ఎన్.రాఘవేంద్ర ఉన్నారు.



పలాస: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



సోంపేట: నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు

నేత్ర పర్వంగా దీపోత్సవం



సాయి మందిరం ప్రాంగణంలో కార్తీక దీపోత్సవం

టెక్కలి: కార్తీకమాసం సందర్భంగా టెక్కలి మండలం కె.కొత్తూరు షిర్డీసాయి మందిరం ఆవరణలో గురువారం రాత్రి నేత్రపర్వంగా దీపోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ధర్మకర్త వాకాడ జగదీశ్వర్ రెడ్డి, ఇందుమంతి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వేద పండితులు బంకుపల్లి సురేష్‌బాబు నేతృత్వంలో శివాభిషేకార్చన, దీపోత్సవం జరిగింది.

ఘనంగా బాలల దినోత్సవం

నేటి బాలలే రేపటి పౌరులని వక్తలు అన్నారు. నవభారత నిర్మాత పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినం సందర్భంగా బాలల దినోత్సవాన్ని గురువారం పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భారతదేశ తొలి ప్రధానిగా నెహ్రూ సేవలను కొనియాడారు. పిల్లలు దేశ నాయకుల వేషధారణతో అలరించారు. పాఠశాలల ఆవరణలో మొక్కలను నాటారు. చిల్డ్రన్స్ డే సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్



కాశీబుగ్గ: వివిధ వేషధారణలో సత్యసాయి విద్యార్థులు



కాశీబుగ్గ: మందస మండలం సొండిపూడి హైస్కూల్‌లో చిన్నారుల సందడి



కవిటి: మండల పరిషత్ పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసిన ఎంపీపీ కడియాల పద్మ, ఉపాధ్యాయ సిబ్బంది



నందిగాం: పెద్దతామరాపల్లిలో బాలల దినోత్సవంలో పిల్లలు



ఇచ్ఛాపురం రూరల్: ఇన్నేశుపేట ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు



పలాస: అల్లుకోలోని ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు



ఇచ్ఛాపురం: బెల్లుపడ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో వివిధ వేషాల్లో చిన్నారులు



సంతబొమ్మాళి: జాతీయ నాయకులు వేషధారణలో దండుగోపాలపురం పాఠశాల విద్యార్థులు



సోంపేట: జింకిభద్ర ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



కంచిలి: కర్తలి ప్రాథమిక పాఠశాలలో నెహ్రూ చిత్రపటం వద్ద విద్యార్థుల నివాళి

అధిక దిగుబడి పద్ధతులపై అవగాహన కల్పించాలి

టెక్కలి: పంటల సాగులో అధిక దిగుబడులు సాధించేందుకు యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీ కె.కృష్ణారావు సూచించారు. టెక్కలి వ్యవసాయ శాఖ ఏడీ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని గ్రామ వ్యవసాయ సహాయకులకు వృత్తి నైపుణ్యత శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రబీ సీజన్‌కు అనుకూలమైన పంటల సాగు, ఇతర యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. స్థానిక ఏడీ బి.వి.తిరుమలరావు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త అనుషా, ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త రాజశేఖర్, ఏవోలు రంగారావు, గోవిందరావు, శ్రీకాంత్‌వర్మ, అప్పారావు ఉన్నారు.

ఉచితంగా సుగర్ వ్యాధి పరీక్షలు

కాశీబుగ్గ: డయాబెటిక్ దినోత్సవం సందర్భంగా పలాస-కాశీబుగ్గ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పలాసలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉచితంగా సుగర్ పరీక్షలను గురువారం చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు హనుమంతు ఎండుదొర, సెక్రటరీ తమ్మినాన మాధవరావు, పూర్వపు అధ్యక్షులు కోర్రాయి బాలక్రిష్ణ, ట్రెజరర్ నెమలిపురి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రోటోకాల్ ఉల్లంఘనను ప్రోత్సహించొద్దు

కంచిలి: అధికార యంత్రాంగం ప్రోటోకాల్ ఉల్లంఘనను ఎట్టి పరిస్థితుల్లో ప్రోత్సహించవద్దని కంచిలి ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు గురువారం నిర్వహించిన బీపీడీపీ శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరైన సిమెంటు రోడ్ల నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమాలకు ప్రజలు చేత ఎన్నికైన సర్పంచ్‌లను ఆహ్వానించకుండా, కనీసం సమాచారం ఇవ్వకుండా చేపట్టడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. భవిష్యత్‌లో ఇటువంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. పంచాయతీల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వి.తిరుమలరావు కోరారు. ఉపాధి ఏపీవో జి.ధనుంజయ పాల్గొన్నారు.

స్థానిక వనరులతో ఆర్థికాభివృద్ధి

ఇచ్ఛాపురం రూరల్: అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకొని పంచాయతీలను అభివృద్ధి చేసుకోవచ్చునని ఎంపీపీ బోర పుష్ప అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో నిర్వహించిన 2025-26 పంచాయతీ ఆర్థిక ప్రణాళిక శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామీణ పాలనను బలోపేతం చేయడం, అట్టడుగు స్థాయిలో స్థిరమైన అభివృద్ధిని నిర్ధారించడంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక ప్రాముఖ్యతను వివరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, డీఎల్‌పీఓ గోపీబాల, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ ఎస్.కృష్ణ, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయండి

నందిగాం: రానున్న ఆర్థిక సంవత్సరంలో పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవో టి.రాజారావు ఆధ్వర్యంలో సర్పంచ్‌లకు, ఎంపీటీసీ సభ్యులకు గ్రామపంచాయతీ డెవలప్‌మెంట్ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శిక్షణ నిచ్చారు. వైస్ ఎంపీపీలు రేగల లక్ష్మీకాంతం, సువ్వారి వసంత్ పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి

సోంపేట: గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎంపీపీ నిమ్మన దాస్ ఎంపీటీసీలు, సర్పంచ్‌లను కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎంపీపీ మంగి గణపతి, వైస్ ఎంపీపీ గురాల శ్రీను, ఎంపీడీవో సీహెచ్. ఈశ్వరమ్మ పాల్గొన్నారు.



కంచిలి: సమావేశంలో మాట్లాడుతున్న దేవదాస్‌రెడ్డి



ఇచ్ఛాపురం రూరల్: మాట్లాడుతున్న ఎంపీపీ బోర పుష్ప



నందిగాం: అభివృద్ధి ప్రణాళికలను వివరిస్తున్న ఎంపీపీ శ్రీరామమూర్తి



సోంపేట: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నిమ్మన దాస్

యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం

సంతబొమ్మాళి: యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో జి.నారాయణరావు పరిశీలనలో వై.వాసుదేవరావు ఎన్నికల అధికారిగా కార్యవర్గాన్ని గురువారం ఎనుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా కానూరు ఆనందరావు, అధ్యక్షులుగా కుసుమూరు పాపారావు, ఉపాధ్యక్షులుగా పిల్లల ఫాల్గుణరావు, చదువుల మాలని, ప్రధాన కార్యదర్శిగా దేవాది గణపతిరావు, కోశాధికారిగా యర్నాగుల సింహాచలం ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంతో జిల్లా ప్రతినిధులు ప్రమాణం చేయించారు.

గుండెపోటుతో వర్క్ ఇన్‌స్పెక్టర్ మృతి



వాసుదేవరావు (ఫైల్)

కోటబొమ్మాళి: సంతబొమ్మాళి మండలంలో హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న దుంపల వాసుదేవరావు (52) గుండెపోటుతో గురువారం సాయంత్రం మృతి చెందారు. కోటబొమ్మాళి మండలం కన్నేవలస గ్రామానికి చెందిన వాసుదేవరావుకు రెండురోజుల క్రితం గుండెపోటు రావడంతో శ్రీకాకుళంలోని మెడికవర్ ఆస్పత్రిలో కుటుంబ సభ్యులు చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈయనకు భార్య చంద్రకళ, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. వాసుదేవరావు మృతిపై పలువురు సంతాపం తెలియజేశారు.